క్లుప్తంగా

స్మశాన వాటిక అభివృద్ధి పనులకు భూమిపూజ

చాపాడు : మండల పరిధిలోని నాగులపల్లె గ్రామంలో స్మశాన వాటిక అభివృద్ధి పనుల కోసం సోమవారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుట్టా మాట్లాడుతూ.. నియోజకవర్గంలో స్మశానాలను అభివృద్ధి చేయడం తొలి ప్రాధాన్యతగా పెట్టుకున్నానన్నారు. ఈ క్రమంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.20లక్షలతో ఒక్కో స్మశాన వాటికను అభివృద్ధి చేస్తామన్నారు. మొదటగా నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఒక్కో మండలంలో ఐదు చొప్పున 25 స్మశానాలను అభివృద్ధి చేసేందుకు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, కేసీ పీసీ వైస్ చైర్మన్ గురివిరెడ్డి, టీడీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటసుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, నాయబ్‌రసూల్, జైనుల్లా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

పోరుమామిళ్ల : ఇటీవల అధికంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, మరణాలపై సోమవారం పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అందులో భాగంగా వసుంధర కల్యాణ మండపం వద్ద మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అతివేగంగా వాహనాలు నడపరాదని, ఓవర్‌లోడు అన్ని విధాల అనర్థదాయకమని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, హెల్మెట్ లేకుండా వాహనాలు తోలరాదని ఆయన పేర్కొన్నారు. రోడ్డు నిబంధనలు పాటించకపోతే చట్టరీత్యా నేరస్తులే అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

అట్లూరు : మండల పరిధిలోని వరికుంట మిట్టన జూదం ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.3,290లు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు సోమవారం సాయంత్రం వరికుంట గ్రామ సమీపాన మిట్టన పొలాల్లో జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా జూదం ఆడుతున్న ముగ్గురు వ్యక్తులు పట్టుబడగా మరో ఇద్దరు పరారయ్యారని, ఈ మేరకు కేసు నమోదు చేశామని, పరారైన వారిని కూడా అరెస్టు చేస్తామని ఆయన పేర్కొన్నారు.

పరామర్శ

కలసపాడు : మండలంలోని మహానందిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బిజివేముల పుల్లారెడ్డి కుమారుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ శివానందరెడ్డి ఇటీవల బెంగుళూరులో రైలు కింద పడి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పీఆర్ఆర్‌డీ మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి పుల్లారెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించి ఓదార్చారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడం బాధాకరమని, ధైర్యం ఉండాలని పుల్లారెడ్డిని కోరారు.

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం

ప్రొద్దుటూరు క్రైం : హెచ్‌ఐవీ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నాటక కళాకారుల బృందం సభ్యులు తెలిపారు. ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, చైతన్య ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీల ఆధ్వర్యంలో హెచ్‌ఐవీపై వీధినాటక రూపంలో సోమవారం వైఎంఆర్‌కాలనీ సర్కిల్‌లో ప్రజలకు వివరించారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ఏఆర్‌టీ సెంటర్‌లో ఉచితంగా మందులను ఇస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జయశంకర్ కళాబృందం సభ్యులు, సీఈఆర్‌డీఎస్ ప్రాజెక్ట్ మేనేజర్ నరేష్ కుమార్, పుల్లయ్య, ఐసీటీసీ కౌన్సిలర్ బాలగంగిరెడ్డి, సిబ్బంది ఓబులమ్మ, భాగ్యలక్ష్మి, సునీత, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

ఈత.. ఆరోగ్యానికి చేయూత

- ఈతపై చిన్నారుల ఆసక్తి
- ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు
- వేసవి సెలవులు సద్వినియోగం



స్విమ్మింగ్‌పూల్‌లో చిన్నారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : నీటిలో ఈత కొడితే సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ఉల్లాసంగా ఉంటుంది. ఇటీవలి కాలంలో పలు పర్యాటక ప్రాంతాల్లో, చెరువుల్లో, బావుల్లో చిన్నారులు నీటిలో దిగి సరదాగా ఆడుకుంటూ ప్రమాదవ శాత్తు ఈత రాక ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఎన్నో కనిపిస్తున్నాయి. నీటిలో ఈత కొట్టడం అంటే ఇష్టపడని వారు ఉండరు. చిన్నారులకు నీటిలో ఆడుకోవడం అంటే మరింత మక్కువ చూపుతారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఈత బావులు, చెరువులలో చిన్నా, పెద్ద అందరూ సెలవు దినాల్లో ఈత కొడుతూ ఉల్లాసంగా గడిపేవారు. పట్టణాల్లో చెరువులు, బావులు ఉండకపోవడం వల్ల ప్రజలు స్విమ్మింగ్ పూల్‌లలో ఈత నేర్చుకొనేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆర్టీపీపీ రోడ్డులోని ఎస్ఎం న్యూ జ్యోతి హెల్త్ క్లబ్, ఎర్రగుంట్ల రోడ్డులోని ఎగ్జిక్యూటివ్ హెల్త్ క్లబ్‌లో ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో చిన్నా, పెద్దా అందరూ కలిసి ఈత నేర్చుకుంటున్నారు.

ప్రయోజనాలు అధికం

ఈత నేర్చుకోవడం ద్వారా శారీరక దృఢత్వం, పోటీతత్వం చిన్నారులలో అలవడుతాయి. స్విమ్మింగ్ చేయడం వల్ల బీపీ, షుగర్, నడుమునొప్పి, కీళ్ల నొప్పులు తదితర వ్యాధులు దరి చేరవేని నిర్వాహకులు చెబుతున్నారు. సమ్మర్ శిక్షణ శిబిరంలో చిన్నారుల నుంచి పెద్దలు కూడా ఈత నేర్చుకుంటున్నారు. ఈత నేర్చుకుని రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచిన వారికి విద్యా, ఉద్యోగ విషయాలలో ప్రభుత్వం రిజర్వేషన్లు సౌకర్యం ఉండటంతో పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. సరదాగా ఈత నేర్చుకోవాలని తన దగ్గరకు వచ్చిన చిన్నారులు జిల్లా, రాష్ట్రస్థాయిలో పతకాలు సాధిస్తున్నారు. స్విమ్మింగ్‌లో మెళకువలు నేర్పించడంతో పాటు బాబింగ్, బెస్ట్ స్ట్రోక్, బ్యాక్ స్ట్రోక్, ఫ్రీస్టైల్, బట్టర్‌ఫ్లై తదితర వాటిలో శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులు వేసవి సెలవులను ఈత నేర్చుకుంటూ సద్వినియోగం చేసుకుంటున్నారు.

ఈత శారీరక ఆరోగ్యానికి దోహదం

ప్రతి విద్యార్థికి చదువుతో పాటు మానసిక, శారీరక ఆరోగ్యం ఎంతో అవసరం. విద్యా సంవత్సరంలో రోజు పాఠశాలకు పుస్తకాలు మోస్తూ ఎంతో ఒత్తిడికి లోనవుతాం. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆటపాటలకు విరామం లేకుండా పోయింది. కొన్ని పాఠశాలల్లో క్రీడా స్థలాలు లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. వేసవి సెలవులు రావడం ఎంతో ఊరట ఇస్తుంది. ఈ మేరకు ఈతకొలనులో శిక్షణ పొందుతున్నాను. మండే ఎండలను ఈత ఉపశమనం ఇస్తుంది.

ఈత నేర్చుకునేందుకు ఆసక్తి



పిల్లలకు ఈతలో శిక్షణ ఇప్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి కనపరుస్తున్నారు. పూల్‌లో ఏరోజుకారోజు నీటిని మారుస్తున్నాము. ఆరేళ్లుగా అనుభవజ్ఞులైన శిక్షకుల ద్వారా స్విమ్మింగ్ శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నాం.

– ఎస్.ప్రభాకర్‌రెడ్డి, న్యూ జ్యోతి హెల్త్ క్లబ్ నిర్వాహకుడు, ప్రొద్దుటూరు

ఈత మంచి వ్యాయామం



ఈత మంచి వ్యాయామం. రోజు ఈత సాధన చేయడం వల్ల శరీర దృఢత్వం చేకూరుతుంది. ఇటీవల ఈత రాక చాలా మంది నీటిలో దిగి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు చూస్తున్నాం. ప్రతి ఒక్కరూ ఈతను నేర్చుకోవాలి.

– సి.రవి, స్విమ్మింగ్ కోచ్

క్రీడాకాడిగా రాణిస్తా



స్విమ్మింగ్‌పై ఆసక్తితో వేసవి శిక్షణా శిబిరంలో చేరి శిక్షణ పొందుతున్నాను. కోచ్ చెప్పే మెళకువలను శ్రద్ధగా నేర్చుకుంటున్నాను. ఈతలో మెళకువలు నేర్చుకుని మంచి స్విమ్మింగ్ క్రీడాకాడిగా రాణిస్తా.

– మందీప్, విద్యార్థి, ప్రొద్దుటూరు

మృతి చెందిన చిన్నారుల కుటుంబీకులకు ఆర్థిక సాయం



మృతి చెందిన బాలుడు మేకల దీక్షత్ తండ్రి గంగాధర్‌కు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే పుట్టా

బ్రహ్మంగారిమఠం : ఈ నెల 12 మండలంలోని మల్లేపల్లె చెరువులో ఈతకు వెళ్లి ఐదుగురు బాలురు మృతి చెందిన విషయం తెలిసిందే. వారి తల్లి దండ్రులకు గ్రీన్ హైవే పనులు చేస్తున్న దిలీప్ కంపెనీ యాజమాన్యం సోమవారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ చేతులమీదుగా పిల్లల తల్లిదండ్రులకు రూ.1లక్ష ప్రకారం చెక్కును అందిచారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్న పిల్లలు చనిపోవడం చాలా బాధాకరమన్నారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాను. మల్లేపల్లె చెరువులో గ్రీన్‌హైవే వారు మట్టిని తీయడంతో అక్కడక్కడా పెద్ద గోతులు ఉన్నట్లు స్థానికులు తెలుపుతున్నారు. దాని ప్రభావంతో పిల్లలు చనిపోయారని స్థానికులు చెప్పారన్నారు. ఇందుకోసం కంపెనీ నిర్వాకులపై ఒత్తిడి తేవడంతో పిల్లల కుటుంబాలకు వారి వంతు సహాయంగా ఆర్థిక సాయం చేశారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, చిలమల నారాయణ యాదవ్, నాయకులు పోలిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, మేకల రమణయ్య యాదవ్, దిలీప్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠంలో బెల్ట్ షాపుల నిర్వాకం



బ్రహ్మంగారిమఠంలో మద్యం సేవించిన భక్తుడు రోడ్డుపైనే ఇలా పడిపోయిన దృశ్యం

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం బ్రహ్మంగారి మఠంలో సోమవారం ఓ యాత్రికుడు మద్యం మైకంలో వర్షపు నీటిలో తేలుతున్నాడు. పుణ్యక్షేత్రానికి 6కిలోమీటర్ల పరిధి మల్లేపల్లెలో మద్యం షాపు ఉంది. మరొక మద్యం షాపు దాదాపు 30 కిలోమీటర్లు నందిపల్లెలో ఉంది. అయినా ఎవరూ మద్యం కోసం అంతదూరం వెల్లనక్కరలేదు. బ్రహ్మంగారిమఠంలో కూల్‌డ్రింక్ షాపులకు వెళ్లితే అక్కడ ముందుగా మద్యం దొరుకుతోంది. తరువాత కూల్‌డ్రింక్స్ ఇస్తారు. దైవదర్శనంకు వచ్చిన యాత్రికుడు స్వామి దర్శనం అనంతరం మద్యం కావాలి ఎక్కడ దొరుకుతుంది అని స్థానికుడిని సంప్రదించాడు. మద్యం కావాలి అంటే హోటల్‌కు వెళతావా లేక కూల్‌డ్రింక్ షాపుదగ్గరైనా మందు దొరుకుతుందని తెలపడంతో మొత్తానికి బి.మఠంలో మద్యం సేవించాడు. తాగిన తరువాత మైకం రావడంతో బి.మఠం – బద్వేల్‌రోడ్డులో వర్షం నీటిలో పడిపోయాడు. మద్యం మత్తులో ఉన్న యాత్రికుడని పక్కకు తీసేవారులేరు. మత్తు దిగిన తరువాత బ్యాగ్ తీసుకొని వెళ్లినట్లు స్థానికులు తెలుపుతున్నారు. కూటమి ప్రభుత్వంలో బెల్ట్‌షాపులు లేవని ప్రజా ప్రతినిధులు, అధికారులు కూడా చెబుతున్నారు. పుణ్యక్షేత్రమైన బి.మఠంలో బెల్టు షాపులు నిర్వహిస్తున్నా పట్టించుకునే నాథుడే లేరా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

నియోజకవర్గంలో కూటమి నాయకుల భూకబ్జాలు

పోరుమామిళ్ల : నియోజకవర్గంలో ప్రభుత్వ భూమి కబ్జా చేయడంలో కూటమి ప్రభుత్వనాయకులు తగ్గేదేలేదన్నట్లు ప్రవర్తిస్తున్నారని లోక్ తాంత్రిక్ జనతాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు బూరగ రత్నం ఆరోపించారు. సోమవారం పోరుమామిళ్లలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ కాశినాయన మండలంలో ఇతర ప్రాంతాల నాయకులు 2 వేల ఎకరాలు ఆక్రమించి స్థానికులకు సెంటు భూమి దక్కకుండా చేశారన్నారు. ప్రభుత్వం వాటన్నిటిపై సమగ్ర విచారణ చేసి, ఆక్రమణదారుల నుంచి భూములు స్వాధీనం చేసుకొని పేద, బడుగు, బలహీన వర్గాలకు రెండు ఎకరాల చొప్పున పంపిణీ చేయాలన్నారు. నియోజకవర్గంలో ఎక్కువగా భూ సమస్యలు ఉన్నాయన్నారు. 7 మండలాలల్లో నిలచిపోయిన రోడ్డు విస్తరణ పనులు పునఃప్రారంభించాలని కోరారు. జ్యోతి క్షేత్రంలో సత్రాలు, భవనాలు పడగొట్టి పాపం చేశారన్నారు. పనులు లేక వలసలు పోతున్నారని, పరిశ్రమలు తెచ్చి ఉపాధి అవకాశాలు చూపాలన్నారు. మహిళలకు రిజర్వేషన్లలో 50 శాతం, బీసీలకు 50 శాతం వాటా కల్పించాలన్నారు.

శివోహం సేవలు ప్రశంసనీయం

ప్రొద్దుటూరు : శివోహం అన్నప్రసాద సేవా సంఘం సేవలు ప్రశంసనీయమని అరబిందో ఇంటిగ్రల్ స్కూల్ కరస్పాండెంట్ కాశీప్రసాద్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ప్రతి సోమవారం నిర్వహించే అన్నప్రసాద సేవలో భాగంగా స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ, శివోహం అన్న ప్రసాద సేవా సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాశీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ మూడేళ్లుగా ఈ సేవ నిర్వహిస్తున్నారన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు మురికూటి సూర్యనారాయణరెడ్డి, సభ్యులు విష్ణు నారాయణ, లింగారెడ్డి, కల్లూరు ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

చౌడూరు చిన్న బోరెడ్డి మృతి



చిన్న బోరెడ్డి మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : మండలంలోని చౌడూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చౌడూరు చిన్న బోరెడ్డి (80) సోమవారం మృతి చెందారు. ఈయన వైఎస్సార్‌సీపీ నేతగా క్రియాశీలకంగా పనిచేశారు. చిన్న బోరెడ్డి సతీమణి పార్వతమ్మ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రొద్దుటూరు వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్‌పర్సన్‌గా పనిచేశారు. ఆయనకు కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ప్రముఖుల నివాళి

చిన్న బోరెడ్డి మరణించిన విషయాన్ని తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సోమవారం ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరసింహారెడ్డి, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు కల్లూరు నాగేంద్రారెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు మల్లేల రాజారాంరెడ్డి, ఎంపీపీ శేఖర్ యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో నివాళి అర్పించారు. మంగళవారం ఉదయం ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

• వేంకటేశ్వరుడికి స్నపన తిరుమంజనం



స్వామివారికి స్నపన తిరుమంజన సేవ చేస్తున్న వేద పండితులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాత మార్కెట్‌లోని శ్రీ లలితాదేవి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ 31వ వార్షికోత్సవం, శ్రవణ నక్షత్రం సందర్భంగా స్నపన తిరుమంజనం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున రతనాల వేంకటేశ్వరునికి, స్వామివారి చెల్లెలు లలితాదేవి మూల విరాట్‌కు పంచామృతాభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీదేవి, భూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామికి విశేషంగా స్నపన తిరుమంజనం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం సామూహికంగా కుంకుమార్చన నిర్వహించి పసుపు, కుంకుమ దీపాలతో స్వామివారిని అర్చించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల వినియోగం జరిగింది.

• ఘనంగా అభిషేకాలు

కలసపాడు : మండల కేంద్రంలో శ్రీ అభయాంజనేయస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ, శిఖర కలశ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా సోమవారం పురోహితులు వారణాసి వెంకటరమణ వరప్రసాద్ బ్రహ్మత్వమున అన్నదానం బాలశివ బాలకుమార్‌శర్మ ఆచారత్వమున అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

• వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు



ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డిని సత్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు

కాశినాయన : మండలంలోని ఇటుగుల్లపాడు గ్రామంలో వెలసిన శ్రీముతుకుండేశ్వర జ్ఞాన ప్రసూనాంబ ఆలయంలో శ్రీపార్వతీ పరమేశ్వరుల శివాలయ పునర్నిర్మాణం, నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో సోమవారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్సీని ఆలయ కమిటీ నిర్వాహకులు శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్నశేషయ్య, నాగసుబ్బారెడ్డి, జిల్లా సెక్రటరీ యాక్టివేట్ కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, రామసుబ్బారెడ్డి, బాలయ్య, కొండయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా సోమవారం నిర్వహించిన బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. మొదటి బహుమతి రూ.లక్షను చౌటపల్లెకు చెందిన చంద్రఓబుల్‌రెడ్డి వృషభాలు, రెండవ బహుమతి రూ.70 వేలను మైదుకూరుకు చెందిన కుర్రా వెంకటేష్‌యాదవ్ వృషభాలు, మూడవ బహుమతి రూ.50 వేలను పత్తూరు గ్రామానికి చెందిన చవ్వా బాలయ్య వృషభాలు, నాల్గవ బహుమతి రూ.30 వేలను నంద్యాల జిల్లా అలగనూరుకు చెందిన రోలిమేడమ్ వృషభాలు, ఐదవ బహుమతి రూ.20 వేలను రామాపురానికి చెందిన రమేష్‌నాయుడు వృషభాలు, ఆరవ బహుమతి రూ.10 వేలను గిద్దలూరుకు చెందిన నారాయణ వృషభాలు గెలుచుకున్నాయి. గెలుపొందిన వృషభాలకు ఆలయ కమిటీ సభ్యులు నగదు బహుమతులను అందజేశారు.

• అల్లాడుపల్లెలో శాశ్వత అన్నదానానికి రూ.1లక్ష వితరణ



విరాళం ఇచ్చిన భక్తుడు చిన్న కుల్లాయన్నకు రశీదు అందజేస్తున్న ఆలయ అధికారులు

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్ర స్వామి సన్నిధిలో శాశ్వత అన్నదానం కోసం సోమవారం బత్తల చిన్న కుల్లాయన్న అనే భక్తుడు రూ.1లక్ష అందజేసినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులు తెలిపారు. వీరభద్రస్వామి సన్నిధిలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి సర్వజన అన్న సత్రంలో ప్రతి సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీని కోసం చాపాడుకు చెందిన బత్తల చిన్న కుల్లాయన్న రూ.1లక్ష నగదును ఆలయ ఈఓ శ్రీనివాసులు, చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్‌లకు అందజేసి రశీదు పొందారు. ఈ నగదును మైదుకూరు లోని ఏపీబీ బ్యాంకులో డిపాజిట్ చేసి దీని నుంచి వచ్చే ఆదాయాన్ని శాశ్వత అన్నదానం కోసం వినియోగిస్తామని ఈఓ చెప్పారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని ఆయా పంచాయతీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు అంకితభావంతో కృషి చేయాలని మండల పరిషత్ అధ్యక్షురాలు బిజివేముల రమణమ్మ కోరారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ తాగునీటి సమస్య, పైపులైను లీకేజీలు గుర్తించి అందుకు తగ్గట్లు చర్యలు తీసుకుని ఎక్కడా తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలని కోరారు. మండల పరిధిలోని ఆయా హౌసింగ్ లేఅవుట్లలో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు త్వరితగతిన బిల్లులు మంజూరయ్యేలా చూడాలని, అలాగే లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా అవగాహన కల్పించాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. మండలానికి రూ.50 లక్షల వ్యయంతో పది ఆర్ఓ ప్లాంట్లు మంజూరయ్యాయని, వాటిని అవసరమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధి కూలీలకు బీమా పథకాలపై అవగాహన కల్పించి ప్రతి కూలీతో బీమా చేయించేలా అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం అజెండాలోని వివిధ అంశాలపై చర్చించారు. సమావేశంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, చిన్నసుబ్బారెడ్డి, ఎంపీడీఓ రామనాథరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ మెంబర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదల పెన్నిధి సుందరయ్య



సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



అట్లూరు: సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



మైదుకూరులో..

ప్రొద్దుటూరు రూరల్ : పేదల పాలిట పెన్నిధి పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ కొనియాడారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువలు, సిద్ధాంతాలకు కట్టుబడిన నాయకుడు సుందరయ్య అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి విజయకుమార్, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సాల్మన్, కోశాధికారి రాఘవ, ప్రమీలమ్మ, రాములమ్మ, సుబ్బలక్ష్మి, చేనేత విభాగం జిల్లా కార్యదర్శి ఓబులేసు, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు అర్బన్ : నేటి తరం కమ్యూనిస్టు నాయకులకు, సభ్యులకు సుందరయ్య జీవితం ఆదర్శం కావాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కె.శ్రీను పేర్కొన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ సభా భవనంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు నాగేంద్రబాబు, చిన్ని, వెంకటేష్, రమణయ్య, మస్తాన్ షరీఫ్, రాయప్ప, శివ, అనంతమ్మ, మోక్షమ్మ, ఖైరున్‌బీ, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : నిజాయితీ కలిగిన, నికార్సైన ఆదర్శ కమ్యూనిస్టు పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం మండల కార్యదర్శి భైరవప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం జీబీ నగర్‌లోని సీపీఎం పార్టీ ఆఫీసు వద్ద పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గౌసియాబేగం, రత్నం, బీబీ, ఓబులయ్య, వెంకటలక్ష్మి, ఫాతిమా పాల్గొన్నారు.

అట్లూరు : కమ్యూనిస్టు ఉద్యమానికి దిక్సూచి పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం మండల కార్యదర్శి ఇ.రమణయ్య తెలిపారు. సోమవారం అట్లూరు క్రాస్ రోడ్డులోని సీపీఎం పార్టీ కార్యాలయంలో సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దుర్గమ్మ, స్వప్న, లత, రవిచంద్ర, గోపయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు : పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శనీయమని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. స్థానిక సుందరయ్య కాలనీలో సోమవారం సుందరయ్య 40వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల అధ్యక్షుడు షరీఫ్, గురయ్య, ఇమామ్, హుస్సేన్, బాబు, లక్ష్మీదేవి, మేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాశినాయన : స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు ఉద్యమనేత పుచ్చలపల్లి సుందరయ్యను ఆదర్శంగా తీసుకుని ఆయన పోరాట స్ఫూర్తితో భూ పంపిణీ అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు అన్వేష్, మండల కార్యదర్శి పోలయ్య తెలిపారు. సోమవారం మండలంలోని సావిశెట్టిపల్లె గ్రామంలో సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు నరసింహులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గురుబాబు, ఖాదర్, ఉదయ్, దేవకుమార్, వరకుమార్, సునీల్, ప్రశాంతి పాల్గొన్నారు.

కలసపాడు : మండలంలోని ముద్దంవారిపల్లెలో సోమవారం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి వేడుకలు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గురయ్య ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.